క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపుహాలులో మంగళవారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతులమీదుగా పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధురాలికి వినికిడి యంత్రం



పరికరం అందిస్తున్న బాలకృష్ణ నాయక్

నగరి: నింద్ర మండలం ఎలకాటూరుకు చెందిన మేరియమ్మ అనే వృద్ధురాలికి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్ సోమవారం వినికిడి యంత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, ఆడియో మెట్రీషియన్ సిద్దయ్య, ఆడియోలజిస్ట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాలసముద్రం: ప్రస్తుతం పాడిపశువులకు వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి భానుప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా వస్తోందని చెప్పారు. వాటికి టీకాలు వేసుకోవాలని సూచించారు. కొందరు రైతులు టీకా వేస్తే పాలు తగ్గిపోతాయన్న అపోహతో టీకాలు వేయించడం లేదని తెలిపారు. అలా చేస్తే పశువులు మృతి చెందే అవకాశముందని వివరించారు. తప్పకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రవికుమార్

నగరి: పట్టణంలోని డిగ్రీకళాశాల మైదానంలో నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను డీఎస్పీ రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నీలో 20 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు అమృతరాజ్ నాడార్, గోవిందస్వామి, గోపి, బాలవర్ధన్‌రాజు తెలిపారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నగరి: గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన యువజనోత్సవాల్లో నగరి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు మాధవి, మమత, హారతి, రిషిత, ధాత్రి, మంజు, హరిత, సాము, సూర్య, కరుణకుమార్‌ను ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్, కల్చరల్ కో–ఆర్డినేటర్ అరుణకుమారి, అధ్యాపకులు రమణారెడ్డి, షర్మిల, సుహాసిని, బాషా అభినందించారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో నేడు ద్వాదశి ద్వారోత్సవం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం భక్తులకు ద్వాదశి ద్వార ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు. సాధారణ, 20 రూపాయల ప్రత్యేక, వీఐపీలకు మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని వైష్ణవాలయాల్లో ఏకాదశి రోజుల ఉత్తర ముఖ ద్వార ప్రవేశాన్ని భక్తులకు కల్పిస్తారు. నారాయణవనం కల్యాణ వెంకన్న ఆలయంతో పాటు తమిళనాడు శ్రీరంగ రఘునాథస్వామి ఆలయంలో మాత్రమే ద్వాదశి రోజున భక్తులను ద్వార ప్రవేశానికి అనుమతిస్తారు. ఇదే ఇక్కడి ప్రత్యేకత.

విద్యుత్ మోటార్ చోరీ

కేవీబీపురం: వ్యవసాయ విద్యుత్ మోటార్ చోరీకి గురైన సంఘటన మండలంలోని పెరిందేశంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన సుబ్బరామనాయుడు తన పొలాలకు సాగునీరు నిమిత్తం విద్యుత్ మోటార్‌ను స్థానిక వాటర్ ట్యాంకు వెనుకవైపు ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా తాళం పగలగొట్టి మోటార్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదలా ఉంచితే మండలంలో దొంగలు తమ ప్రతాపం చూపుతున్నారు. ఐదునెలల కాలంలో సుమారు 20 విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. కోవనూరు, బ్రాహ్మణపల్లె, కండ్లూరు, అంజూరు పాళెం, ఆదవరం గ్రామాల్లో ఈ చోరీ ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.

ఘనంగా వైకుంఠ ఏకాదశి



తెరణిలో గరుడవాహనంపై వైకుంఠనాథస్వామి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి





కరియమాణిక్యస్వామి దర్శనానికి వెళుతున్న భక్తులు, శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పుత్తూరు రూరల్: పుత్తూరులో శ్రీవేంకటేశ్వరస్వామికి హారతి



వెదురుకుప్పం: కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో భక్తులు



పుత్తూరు రూరల్: గీతా మందిరంలో శ్రీకృష్ణస్వామి

నగరి: మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కరియమాణిక్యస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు క్యూలో బారులు తీరారు. శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యసామిని విశేషంగా అలంకరించారు. డీవైఈఓ నాగరత్నం, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సలహా కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రాజీవ్ నగర్ కొండపై షిర్డీ సాయి దివ్యదామంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. తెరణిలోని వైకుంఠనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు గరుడవాహనంపై విహరించారు. బుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని ప్రయాగ మాధవస్వామిని, సత్రవాడలో కరివరదరాజ ఆలయంలోని కరివరదరాజ స్వామిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో చేసిన విశేషాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పాతభజన గుడి వీధిలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఓంశక్తి ఆలయం వద్ద సర్వే డీటీ మేఘవర్ణం కుటుంబసభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం చేశారు.

నింద్ర: మండలంలోని కూనమ రాజుపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవదేవేరులకు వేకువనే తిరుమంజనం, మహాయాగం, విశేష పూజలు జరిపించారు. సాయంత్రం తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గీతా మందిర ఆశ్రమం పీఠాధిపతి శ్రీ పుండరీక వరదానందస్వామి పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలోని వేకటేశ్వరస్వామి విగ్రహం వద్ద వైకుంఠ ద్వారం ఏర్పాటు చేశారు. స్వామి వారిని సుందరంగా అలంకరించారు. గీతా మందిరంలోని శ్రీకృష్ణస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయం, ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరీ, ఆంజనేయస్వామి ఆలయాలు, షిర్డిసాయిబాబా, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మందిరాలకు భక్తులు పోటెత్తారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఉభయ దేవేరులతో పాటు స్వామి వారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌బాబు, షరాబ్ గణేష్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకుల బృందం తిరుప్పావై నిర్వహించారు. అనంతరం మూలవర్లకు అభిషేకాది పూజలు చేశారు. భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త శ్రీధర్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో.

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంటలో ఉన్న పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తి ప్రపత్తులతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని పట్టుపీతాంబరాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పచ్చికాపల్లంలోని రామాలయం, డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి, చవటగుంటలోని నందీశ్వరస్వామి ఆలయం, చవటగుంటలోని శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు.











వైకుంఠద్వార దర్శనంలో భక్తులు, కరియమాణిక్యస్వామి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు, నింద్ర : పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, కార్వేటినగరం : ఆలయంలోని దర్శనానికి వెళుతున్న భక్తులు, అన్నదానం చేస్తున్న సర్వే డీటీ మేఘవర్ణం, కుటుంబసభ్యులు

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి



ఎంపీపీ లతను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

కార్వేటినగరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ లత తెలిపారు. సచివాలయ సిబ్బంది సోమవారం ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి దుశ్శాలువలతో సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు కూడా సహకరించినప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, డిప్యూటీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి సుబ్రమణ్యం, రమేష్ బాబు, శేషాద్రి, ఎంపీడీవో మోహన్‌మురళీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలి



క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది విద్యార్థుల శాతం పెంచాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్ సూచించారు. ఆయన సోమవారం ఎమ్మార్సీ భవనంలో మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించినట్లు గుర్తుచేశారు. పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు అన్నీ ఉచితంగా ఇస్తున్నట్లు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎస్టీయూ మండల అధ్యక్షుడు కోదండయ్య సమక్షంలో ఎస్టీయూ క్యాలెండర్ అవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు



జేసీబీతో తొలగిస్తున్న కరెంట్ స్తంభాలు



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్మశాన వాటిక దారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. అనంతరం శ్మశాన వాటికలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ఎలక్ట్రికల్ క్రిమిటోరియం షెడ్‌ను పరిశీలించారు.

అర్హులందరికీ పెన్షన్ల పంపిణీ



పెన్షన్ అందుకున్న లబ్ధిదారులతో కౌన్సిలర్లు





పెన్షన్లు అందిస్తున్న వైస్‌చైర్మన్ బాలన్, ఏకాంబరకుప్పంలో పింఛన్ అందిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాసన్

నగరి: సాంకేతిక కారణాలతో పింఛన్లపై నోటీసులు అందుకున్న వారి వివరాలను అధికారులు మరో పర్యాయం పరిశీలించి, అర్హులుగా తేలినవారికి పెన్షన్లు పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికృష్ణారెడ్డి సమక్షంలో వలంటీర్లు రూ.2,750 మందికి పింఛన్ పంపిణీ చేశారు. సత్రవాడ దళితవాడలో వైస్ చైర్మన్ బాలన్ పెన్షన్లు అందజేశారు. ఏకాంబరకుప్పంలో కౌన్సిలర్ వీకే శ్రీనివాసన్ అర్హులుగా గుర్తించిన అందరికీ పింఛన్లు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు



కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఏ.కార్తీక్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ఈ మేరకు విద్యార్థితోపాటు ఉత్తమ శిక్షణ అందించిన పీఈటీ గీతమ్మను అభినందించారు.



నితీష్

నింద్ర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నితీష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. సోమవారం ఈ మేరకు విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి రోజా పర్యటన నేడు

నగరి: విజయపురం మండలం కాళికాపురం సచివాలయ పరిధిలోని జీఎం పురం, దళితవాడలో మంగళవారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి ఆర్కే రోజా పాల్గొననున్నారు. అనంతరం మండల కార్యాలయంలో మధ్యాహ్నం 2:30 గంటలకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

అంటువ్యాధుల నివారణకు జాగ్రత్తలు



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: అంటువ్యాధులు నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని బుక్కపట్నం గ్రామంలో సోమవారం ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కరోనా కొత్త వేరియంట్ సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలన్నారు. చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 18 ఏళ్లపైబడిన వారు తప్పనిసరిగా బూస్టర్ డోస్ వేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీధర్, సీహెచ్ఓ మానికశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు జైపూర్ కాళ్లు

వడమాలపేట: ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యూష స్వామిజీ చేతులమీదుగా దివ్యాంగులకు జైపూర్ కాళ్లు పంపిణీ చేయనున్నట్లు వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం అప్పలాయగుంటలో ఆయన మాట్లాడుతూ అవసరమైనవారు 9985001025, 9390568667, 9966959123 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేతకు నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: తయ్యూరు మాజీ సర్పంచ్ బాబు తండ్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు టీ.తంగవేలు (87) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గ్రామానికి వెళ్ళి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, తయ్యూరు సర్పంచ్ వరదమ్మ, ఎంపీపీ సరిత తదితర నాయకులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ





క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కార్వేటినగరంలో ఎంఈఓ

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు భారతి ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి పుతూరులో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోవిందన్, రామచంద్రారెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, నాగరాజు, హరినాథ పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్

యూటీఎఫ్ 2023 క్యాలెండర్, డైరీలను సోమవారం వెదురుకుప్పంలో ఎంఈఓ విజయకుమార్ ఆవిష్కరించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో డైరీతో పాటు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణరెడ్డి, దేశయ్య, శ్రీనివాసులు, రామమూర్తి, పీతాంబర రెడ్డి, లోకనాథం, సుభాషిణి, రామకృష్ణ, బండి ప్రభాకరరెడ్డి, శ్యామల పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

కార్వేటినగరం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏపీటీఎఫ్ 2023 క్యాలెండర్లు, డెయిరీలను సోమవారం ఎంఈవో విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందయ్య, మధుసూదన్‌రెడ్డి, రమేష్, కిరణ్, చలపతిరావు పాల్గొన్నారు.

పెంచిన పింఛనుతో ఆనందం



నల్లవెంగనపల్లెలో పింఛనుదారుల ఆనందం

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుంచి పింఛన్ రూ.2,750కు పెంచి ఇస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని నల్లవెంగనపల్లె, మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలోని పింఛనుదారులకు సొమ్మును అందజేశారు. ఆయన మాంబేడులో మాట్లాడుతూ అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వును చూడాలన్న సంకల్పంతో సీఎం పింఛన్ సొమ్మును దశల వారీగా పెంచుతూ వారికి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగుల జీవితాల్లో సంక్షేమ పథకాల ద్వారా వెలుగును నింపుతున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్ అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, సర్పంచ్‌లు పుష్ప(నల్లవెంగనపల్లె), కవిత(మాంబేడు), డీడీఓలు కుమార్, సుబ్రమణ్యం, వలంటీర్లు పాల్గొన్నారు. మాంబేడు గ్రామ సచివాలయంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీవైఈఓ రఘురామయ్య

పుత్తూరు రూరల్: ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్, డైరీని డీవైఈఓ రఘురామయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఈఓను సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆనంద్‌బాబు, చెంగల్రాజుపాల్గొన్నారు.